## క్లుప్తంగా

### నవంబర్ 3న 'జగనన్నకు చెబుదాం'

చాపాడు : నవంబర్ 3వ తేదీన మండల కేంద్రమైన చాపాడులో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మండల అభివృద్ధి అధికారి శ్రీధర్‌నాయుడు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉదయం 9.30గంటల నుంచి జరుగనున్న ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ విజయరామరాజు హాజరుకానున్నారని, ఎలాంటి సమస్యలు ఉన్నా ప్రజలు కలెక్టర్ దృష్టికి తీసుకురావచ్చని ఎంపీడీఓ కోరారు.

### నేడు మండల సమావేశం

చాపాడు : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు మండల అధ్యక్షులు తెలిదేల లక్షుమయ్య తెలిపారు. ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్న సమావేశానికి ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి హాజరుకానున్నారని, అన్ని శాఖల అధికారులతో పాటు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరు కావాలని ఎంపీపీ కోరారు.

### భూమి పూజ



ఖాదర్‌పల్లెలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎంపీపీ లక్షుమయ్య

చాపాడు : ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని మండల అధ్యక్షులు తెలిదేల లక్షుమయ్య పేర్కొన్నారు. మండలంలోని ఖాదర్‌పల్లె గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన రూ.12లక్షల నిధులతో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టేందుకు శుక్రవారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా హాజరైన ఎంపీపీ మాట్లాడుతూ.. ఖాదర్‌పల్లెకు రూ.25 లక్షలు మంజూరవగా రూ.12లక్షలతో సిమెంట్ రోడ్లు నిర్మించనున్నామన్నారు. పనులను వేగంగా నాణ్యతగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జైనుల్లా, ఉప సర్పంచ్ మహబూబ్ బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు షఫీ, పల్లవోలు ప్రసాద్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

### మాజీ జవాన్‌కు నివాళి



వెంకటరమణారెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఆర్మీ మాజీ జవానులు

కాశినాయన : మండలంలోని మిద్దెల గ్రామానికి చెందిన ఆర్మీ మాజీ జవాన్ అంబవరం వెంకటరమణారెడ్డి కామెర్ల వ్యాధితో హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. శుక్రవారం స్వగ్రామమైన మిద్దెలో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. పోరుమామిళ్లలోని మాజీ సైనిక ఉద్యోగుల సంఘం నాయకులు వెంకటరమణారెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ కె.రమణారెడ్డి, టీడీపీ నాయకులు వెంకటరెడ్డితోపాటు పలువురు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

### దూదేకులు టీడీపీని నమ్మవద్దు

ప్రొద్దుటూరు కల్చరల్ : దూదేకుల కులస్తులు తెలుగు దేశం పార్టీని నమ్మవద్దని నూర్‌బాషా దూదేకుల సంక్షేమ సంఘం నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు కడియాల ఖాదర్‌బాష ఒక ప్రకటనలో కోరారు. గుంటూరులో నిర్వహించనున్న దూదేకుల సింహగర్జన టీడీపీకి లబ్ధి చేకూర్చేందుకే నిర్వహిస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో తమను వాడుకుని దూదేకుల సమస్యలను పరిష్కరించడంలో వారు పూర్తిగా విఫలమయ్యారన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దూదేకుల కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతో పాటు దూదేకుల సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు. కొందరు దూదేకుల సమస్యలను పట్టించుకోకుండా తెలుగు దేశం పార్టీకి లబ్ధిచేకూర్చాలనే సింహగర్జన నిర్వహిస్తున్నారని, ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

### రేపు తిరుపతిలో రెడ్డి సంఘం వార్షికోత్సవం

రాజుపాళెం : తిరుపతిలోని రెడ్డి భవనంలో ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం ఐదవ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించనున్నట్టు ఏపీ రెడ్డి సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ఆయన రాజుపాళెంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 70 లక్షల మంది రెడ్ల ఐక్యత కోసం రాజకీయాలకు అతీతంగా దాదాపు అన్ని ప్రాంతాల్లో సభలు, చైతన్య యాత్రలను చేశామన్నారు. రెడ్డి సంఘం ఆధ్వర్యంలో కొంత మంది పేద రెడ్డి విద్యార్థులకు, మహిళలకు ఆర్థిక సహాయం అందించామని తెలిపారు. జిల్లాలోని రెడ్డి నాయకులంతా సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

### మద్యం బాటిళ్లతో వ్యక్తి అరెస్టు

పోరుమామిళ్ల : మండల కేంద్రంలోని రంపాడు రోడ్డులో అనుమతి లేకుండా మద్యం అమ్ముతున్న కోటపాటి సంజీవరాయుడును పోలీసులు గురువారం అదుపులోకి తీసుకుని అతడి నుంచి 13 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. అతడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.

# ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే ధ్యేయం

**ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ**



వైద్యుడికి ప్రశంసాపత్రం ఇస్తున్న నాయకులు

పోరుమామిళ్ల : వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. శుక్రవారం రంగసముద్రం–2 సచివాలయం వద్ద నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరంలో వారు పాల్గొని మాట్లాడారు. దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్ర ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే ధ్యేయంతో ఆయన వివిధ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి 108 అమలు చేస్తే, జగన్‌మోహన్‌రెడ్డి అంతకుమించి విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, ఫ్యామిలీ డాక్టర్‌ను ఏర్పాటు చేశారన్నారు. ఆరోగ్య సురక్షతో స్పెషలిస్టు వైద్యులతో, వైద్య సిబ్బందితో ఇంటివద్దనే వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం దేశంలో ఎక్కడా లేదన్నారు. శిబిరంలో పాల్గొన్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయప్రతాప్‌రెడ్డి, పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ రాష్ట్ర సలహాదారు నాగార్జునరెడ్డి, ఆప్కాస్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ కళ్యాణచక్రవర్తి, నాట్యకళల రాష్ట్ర డైరెక్టర్ ఈశ్వరమ్మ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్య రంగాల్లో పెను మార్పులు తెచ్చారని అన్నారు. కార్యక్రమంలో సురక్ష కార్యక్రమంలో సేవలందించిన వైద్యసిబ్బందికి ప్రశంసాపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, గిరిప్రణీత్‌రెడ్డి, ఎంపీటీసీలు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు క్రైం : జగనన్న ఆరోగ్య సురక్షతో పేద, మధ్య తరగతి ప్రజలకు మెరుగైన ఉచిత వైద్యం లభిస్తుందని ఎంపీపీ సానబోయిన శేఖర్‌యాదవ్ తెలిపారు. కామనూరు పీహెచ్‌సీ పరిధిలోని సోములవారిపల్లె పంచాయతీలో ఉన్న వికాస్ హైస్కూల్ వద్ద తహసీల్దార్ నజీర్ అహ్మద్ ఆధ్వర్యంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మండల స్పెషల్ ఆఫీసర్ సురేష్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజు వైద్య శిబిరాన్ని పరిశీలించారు. 572 మంది వివిధ రకాల ఆరోగ్య సమస్యలకు చికిత్స చేయించుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శివప్రసాద్‌రెడ్డి, ఎపిడామాలజిస్టు డాక్టర్ ఖాజామొహిద్దీన్, ఎంపీటీసీ సుభాస్‌చంద్రబోస్, ఏఎంఓ వెంకటరెడ్డి, హెచ్‌ఈలు వెంకటేశ్వర్లు, శోభారాణి, సూపర్‌వైజర్ బీఏ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## జగన్‌తోనే బడుగు, బలహీనవర్గాల అభివృద్ధి



మాట్లాడుతున్న టీటీడీ బోర్డు మెంబర్ సిద్ధవటం యానాదయ్య

ప్రొద్దుటూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తోనే బడుగు, బలహీనవర్గాల అభివృద్ధి సాధ్యం. వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలపై ఎంతైనా ఉంది. బీసీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించింది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమేనని టీటీడీ పాలకమండలి సభ్యుడు సిద్ధవటం యానాదయ్య తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని 139 బీసీ కులాలకు గుర్తింపు వచ్చింది ఈ ప్రభుత్వంలోనేనన్నారు. గతంలో బీసీల్లోని నాలుగైదు కులాలకు లబ్ధి చేకూర్చి, బీసీలకు లబ్ధి చేకూర్చామని ప్రచారం చేసుకునేవారన్నారు. సీఎం జగన్ బీసీల కోసం 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేశారన్నారు. చట్ట సభల్లో ప్రాధాన్యత కల్పించారని, 28 మంది బీసీలను ఎమ్మెల్సీలుగా ఎంపిక చేశారన్నారు. గతమ ప్రభుత్వంలో నాలుగు రాజ్యసభ స్థానాలు ఖాళీ అయితే అందులో రెండు బీసీలకు కేటాయించారన్నారు. ఆర్.కృష్ణయ్య లాంటి ఉద్యమ నాయకుడిని రాజ్యసభకు పంపిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. రాష్ట్రంలోని 1180 ఆలయ పాలకమండళ్లలో నాయీబ్రాహ్మణులకు స్థానం కల్పించారన్నారు. టీటీడీలో 3వేల మంది నాయీబ్రాహ్మణులు పనిచేస్తున్నారని తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలను గుర్తించలేదన్నారు. శనివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు జరిగే బస్సు యాత్రను జయప్రదం చేయాలని ఆయన కోరారు. పద్మశాలీ కార్పొరేషన్ చైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మి మాట్లాడుతూ గత ప్రభుత్వాల హయాంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలో తమ ఉనికిని చాటుకునే అవకాశమే లేకుండా పోయిందన్నారు. అలాంటి వారిని గుర్తించి ఉన్నత పదవులు కల్పించిన వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానికి జీవితాంతం రుణపడి ఉంటామన్నారు.

## ప్రజారక్షణ భేరిని జయప్రదం చేయండి



కరపత్రాలను పంపిణీ చేస్తున్న నాయకులు

అట్లూరు/పోరుమామిళ్ల : కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని, విభజన చట్టంలో పొందుపరిచిన హామీలను అమలు చేయాలని చేపట్టిన సీపీఎం పార్టీ ప్రజారక్షణ భేరి బస్సుయాత్రను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు, డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు ఎం.చిన్ని, సీపీయం పోరుమామిళ్ల మండల కార్యదర్శి భైరవప్రసాద్‌లు పిలుపునిచ్చారు. శుక్రవారం వారు బద్వేలు, పోరుమామిళ్లలలో జరిగిన వేర్వేరు కార్యక్రమంలో సీఐటీయూ, డీవైఎఫ్‌ఐల ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి బహిరంగసభను జయప్రదం చేయాలని కరపత్రాలను పంచారు. కార్యక్రమంలో సీపీఎం పోరుమామిళ్ల నేతలు గౌసియాబేగం, బీబీ, రవి, సుధాకర్, డీవైఎఫ్‌ఐ బద్వేలు నాయకులు ఆంజనేయులు, సురేంద్ర, సీఐటీయూ నాయకులు సుబ్బరాయుడు, రాజగోపాల్ పాల్గొన్నారు.

**బస్సు జాతాను జయప్రదం చేయండి**

మైదుకూరు : అసమానతలులేని అభివృద్ధి, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం సీపీఎం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రజా పరిరక్షణ భేరి బస్సు జాతాను బహిరంగ సభను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్ర శేఖర్ పిలుపునిచ్చారు. శుక్రవారం మైదుకూరులోని సుందరయ్య నగర్‌లో సీపీఎం మైదుకూరు మండల కార్యదర్శి షరీఫ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈనెల 30వ తేదీ కర్నూలు జిల్లా నుండి బయల్దేరిన బస్సు జాతా 31న సాయంత్రం మైదుకూరు , 1న ఉదయం బద్వేలు, మధ్యాహ్నం కడపకు చేరుకుంటుందని వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించే బహిరంగ సభలను జయప్రదం చేయాలని కోరారు.

## పంట నమోదుపై అభ్యంతరాలను తెలపండి



గోపవరం: రాచాయపేట ఆర్బీకేలో పంట నమోదు జాబితాను పరిశీలిస్తున్న ఏడీఏ నాగరాజ

గోపవరం : పంట నమోదుపై అభ్యంతరాలు ఉంటే రైతులు రాతపూర్వకంగా తెలియజేయవచ్చని బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని రాచాయపేట, టి.సండ్రపల్లె, బ్రాహ్మణపల్లె రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయాధికారి అరవిందనాయక్ అధ్యక్షతన ఖరీఫ్‌లో సాగైన వివిధ పంటలకు సంబంధించి పంట నమోదుపై గ్రామసభలు నిర్వహించారు. ముందుగా పంట నమోదు జాబితాలను ఆర్బీకేలలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎంత విస్తీర్ణంలో ఏ పంటలు నమోదు చేశారు అనే అంశాలను జాబితాలో పరిశీలించుకుని ఏవైనా అభ్యంతరాలు ఉంటే రాతపూర్వకంగా తెలపాలన్నారు.

అట్లూరు : బద్వేలు మండలం రాజుపాళెం రైతు భరోసా కేంద్రం పరిధిలో పంట నమోదుపై ఉద్యాన శాఖ అధికారి(హెచ్‌ఓ)జయభరత్‌రెడ్డి సామాజిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ముందుగా రైతుభరోసా కేంద్రంలోని ఖరీఫ్ – 2023కు సంబంధించిన పంట నమోదు వివరాలను తెలుసుకుని అనంతరం సంబంధిత పొలాలకు వెళ్లి రైతులతో మాట్లాడారు. రైతులు సాగు చేసిన పంటను పంట నమోదు చేయించుకుంటే పకృతి వైపరీత్యాల వల్ల నష్టం వాటిల్లితే సంబంధిత రైతుకు నష్టపరిహారం ప్రభుత్వం అందిస్తుందన్నారు.

కాశినాయన : మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో 2023 ఖరీఫ్‌కు సంబంధించి పంట నమోదుపై సామాజిక తనిఖీ, గ్రామసభలు నిర్వహిస్తామని మండల వ్యవసాయాధికారి ప్రవీణ్ కుమార్ తెలిపారు. నేటి నుంచి 29వ తేదీ వరకు ఆర్బీకేలలో పంట నమోదు జాబితాను ప్రదర్శిస్తామన్నారు.

## జగన్ చేసిన మేలును చెప్పండి

**ఎమ్మెల్యే రఘురామిరెడ్డి**



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

మైదుకూరు : రాష్ట్రానికి మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమంలో రాష్ట్ర ప్రజలకు జగన్ చేసిన మేలును చెప్పాలని, అలాగే చంద్రబాబు చేసిన మోసాలను ఎండగట్టాలని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. శుక్రవారం మైదుకూరులోని భగవాన్ సాయి కల్యాణ మండపంలో ఏపీకి మళ్లీ జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయాల కన్వీనర్ బండి నాగేంద్ర ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి మాట్లాడారు. ఏపీకి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకుపోవాల్సిన బాధ్యత నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, కార్యకర్తలు, వలంటీర్లపై ఉందని అన్నారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరించేందుకు వలంటీర్లు కృషి చేశారని పేర్కొన్నారు. చంద్రబాబు 2014 ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చారని.. ఆ తర్వాత అమలు చేయకుండా మోసం చేశారని ధ్వజమెత్తారు. డ్వాక్రా మహిళలు, రైతులు .. ఇలా అన్ని వర్గాల వారినీ చంద్రబాబు మోసం చేశారన్నారు. పాఠశాలలను పట్టించుకోలేదన్నారు. చంద్రబాబు హయాంలో పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వలేదన్నారు. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక 33 లక్షల మందికి ఇంటి స్థలాలను, పక్కా ఇళ్లను మంజూరు చేశారని, త్వరలోనే 22 లక్షల పక్కా ఇళ్లు పూర్తి కానున్నాయని వివరించారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి, అధికార భాషా సంఘం సభ్యుడు తవ్వా వెంకటయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణ రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్మయి మండల కన్వీనర్ గల్లా నరసింహారెడ్డి, కేపీ లింగన్న, ఎంపీపీ థామస్, వైస్ ఎంపీపీ ఊటుకూరు రఘురామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### వేలంపాటకు విశేష స్పందన

పోరుమామిళ్ల : మండలంలోని శ్రీ మద్దిమాను గురప్పస్వామి దేవస్థానం వద్ద నిర్వహించిన తలనీలాల వేలం పాటలో ప్రొద్దుటూరుకు చెందిన చెన్నకేశవ అనే వ్యక్తి రూ.16,22,400లకు పాడి దక్కించుకున్నట్లు దేవదాయశాఖ ఈఓ నరసయ్య తెలిపారు. షామియానాలు, వంటపాత్రల వేలాన్ని రూ. 4.55 లక్షలకు చిన్నాయపల్లె శివారెడ్డి దక్కించుకున్నారన్నారు. కార్యక్రమంలో రాజంపేట డివిజన్ ఇన్స్పెక్టర్ శివయ్య, ఆలయ చైర్మన్ సాయిప్రసాదరెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారన్నారు.

### తెలుగు భాష అమలు కావాలి

ఖాజీపేట : ప్రభుత్వ కార్యాలయాల్లో అన్ని రకాల ఉత్తర ప్రత్యుత్తరాలు 70శాతం తెలుగులోనే జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలుగు భాషా సంఘం రాష్ట్ర సభ్యుడు తవ్వా వెంకటయ్య అధికారులను కోరారు. ఖాజీపేట మండలంలో ఎంపీడీఓ కార్యాలయం, పోలీస్‌స్టేషన్, మిడుతూరు, తుడుమలదిన్నె, తవ్వారిపల్లె సచివాలయాలను ఆయన పరిశీలించారు. హాజరుపట్టిక దగ్గర నుంచి అన్ని రికార్డుల ఉత్తర ప్రత్యుత్తరాల గురించి అడిగి తెలుసుకున్నారు. చాలా వరకూ ఇంగ్లీస్ లోనే ఉండటం పై అసంతృప్తి వ్యక్తం చేశారు. తెలుగులో జరగాలని ప్రభుత్వం జీఓ ఇచ్చినా అధికారులు ఎందుకు అమలు చేయడం లేదని అన్నారు. దిగువ స్థాయి నుంచి అమలు చేయడం మొదలు పెడితే చక్కగా అమలవుతాయని అన్నారు.

### రైతు భరోసా కేంద్రాల్లో పంటల సాగు జాబితా

దువ్వూరు : మండల వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటల వివరాల జాబితాను శుక్రవారం నుంచి రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంటుందని మండల వ్యవసాయాధికారి అమరనాథరెడ్డి తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటల జాబితాను శుక్రవారం అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ జాబితాను రైతులు, ప్రజా ప్రతినిధులు పరిశీలించి పంటల వివరాలను, సర్వే నంబర్లను సరి చూసుకోవాలని, ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేసేందుకు శుక్రవారం నుంచి ఈనెల 30వ తేదీ వరకు అన్ని ఆర్బీకేల్లో గ్రామ సభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఏవైనా తేడాలు ఉంటే ఆర్‌బీకేలోని వ్యవసాయ, ఉద్యాన సహాయకుల వద్ద సరిచేసుకోవాలని సూచించారు.

### కాంగ్రెస్ ర్యాలీ

మైదుకూరు : రైతాంగ సమస్యలపై చలో మైదుకూరు పేరుతో కాంగ్రెస్ పార్టీ శుక్రవారం మైదుకూరు పట్టణంలో ర్యాలీ నిర్వహించింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఎస్.తులసిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కరువు మండలాలను ప్రకటించాలని, ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

అట్లూరు : బద్వేలు మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ హాలులో శనివారం ఉదయం 10:30 గంటలకు బద్వేలు మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

### డిసెంబర్‌లోపు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

గోపవరం : డిసెంబర్ చివరిలోపు జగనన్న ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ పేర్కొన్నారు. శుక్రవారం రాచాయపేటలో జగనన్న కాలనీలో ఇన్‌చార్జి ఎంపీడీఓ హసీనా, సచివాలయ సిబ్బందితో కలిసి ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. వివిధ దశల్లో ఉన్న 54 ఇళ్లను డిసెంబర్ 30 లోపు పూర్తయ్యేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఇళ్లు నిర్మిస్తున్న ఏజెన్సీ నిర్వాహకులు, లబ్ధిదారులతో మాట్లాడి త్వరగా ఇళ్లు నిర్మించాలని తెలియజేశారు. ఏవైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలన్నారు. అలాగే జగనన్న కాలనీలలో ఇంకుడుగుంతలతోపాటు వ్యక్తిగత మరుగుదొడ్లను నిర్మించుకోవడాన్ని వేగవంతం చేయాలని తెలిపారు. ఇళ్ల పరిశీలనలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ రవి, పంచాయతీ కార్యదర్శులు వెంకటసుబ్బయ్య, నిఖిత తదితరులు ఉన్నారు.

### నవంబరు 5న గడియారం పురస్కారోత్సవ సభ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీకృష్ణగీతాశ్రమంలోని వెంకటేశ్వర డిగ్రీకళాశాల ఆడిటోరియంలో నవంబరు 5న సాయంత్రం 5.30 గంటలకు డాక్టర్. గడియారం వేంకటశేష శాస్త్రి 42వ సాహిత్య పురస్కార ప్రధానోత్సవ సభ నిర్వహించనున్నట్లు రచన సాహిత్య వేదిక ఉపాధ్యక్షుడు గడియారం వేంకట శేషశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ అవధాని డాక్టర్ నరాల రామారెడ్డి గడియారం పురస్కారం అందుకుంటారని, ముఖ్య అతిథులుగా రచనా సాహిత్య వేదిక అధ్యక్షుడు విహారి (జేఎస్ మూర్తి), వైవీయూ పాలకమండలి సభ్యుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, కేంద్రసాహిత్య అకాడమి పురస్కార గ్రహీత డీకే చదువులబాబు, శతావధాని ఆముదాల మురళి, డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, ఎస్ఆర్ ప్రతాపరెడ్డి, ఎస్.సుదీర్‌రెడ్డి తదతరులు పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సాహితీ వేత్తలు, అభిమానులు పాల్గొనాలని రచన సాహిత్య వేదిక, గడియారం కుటుంబీకులు కోరారు.

## నేడు ప్రొద్దుటూరులో ట్రాఫిక్ మళ్లింపు

**ఇన్‌చార్జి డీఎస్పీ నాగరాజు**

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలో వైఎస్సార్‌సీపీ నిర్వహించే సామాజిక సాధికారత యాత్ర సందర్భంగా శనివారం ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు ఇన్‌చార్జి డీఎస్పీ నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వే స్టేషన్‌రోడ్డులోని వైవీఆర్ కల్యాణ మండపం నుంచి రామేశ్వరం, గాంధీరోడ్డు మీదుగా విజయ్‌కుమార్ సర్కిల్, రాజీవ్ సర్కిల్, శివాలయం సర్కిల్ వరకు యాత్ర ఉన్నందున మధ్యాహ్నం 12 గంటల నుంచి ప్రజలు ఇరువైపులా ఉన్న రింగు రోడ్డు మీదుగా రాకపోకలు సాగించాలన్నారు. జమ్మలమడుగు వైపు నుంచి వచ్చే బస్సులు పట్టణంలోకి రాకుండా పొట్టిపాడు క్రాస్ రోడ్డు ద్వారా, మైదుకూరు వైపు నుంచి వచ్చే బస్సులు ఆర్టీసీ బస్టాండు దగ్గర నుంచి, రాజుపాళెం వైపు నుంచి వచ్చే బస్సులు మల్లేలమ్మ గుడి వద్ద నుంచి, ఎర్రగుంట్ల వైపు నుంచి వస్తున్న బస్సులు పట్టణంలోకి రాకుండా వాసవి సర్కిల్ నుంచి రాకపోకలు సాగించాలని సూచించారు. జమ్మలమడుగు వైపు నుంచి వ్యక్తులు వారి వాహనాలను ఎగ్జిబిషన్ గ్రౌండ్ వద్ద ఉన్న అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణం, మార్కెట్ యార్డులో, రాజుపాళెం వైపు నుంచి వచ్చే వారు కార్లు, బైక్‌లను పాలిటెక్నిక్ కాలేజీలో, మైదుకూరు, ఎర్రగుంట్ల వైపు నుంచి వచ్చే వారు టూ టౌన్ బైపాస్ రోడ్డులో వాహనాలను పార్కింగ్ చేయాలన్నారు.

## వృద్ధాశ్రమాలకు నిత్యావసర వస్తువులు



నిత్యావసర వస్తువులను అందిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

ప్రొద్దుటూరు కల్చరల్ : లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని పలు వృద్ధాశ్రమాలకు నిత్యావసర వస్తువులను అందజేశారు. అమ్మానాన్న వృద్ధాశ్రమం, విజయేశ్వరి, విశ్వప్రేమ, వికాస్ విహార్ బుద్ధిమాంద్యం పిల్లల పాఠశాలలకు బియ్యం ప్యాకెట్, కందిబేడలు, బెల్లం తదితర నిత్యావసర వస్తువులను లయన్స్ క్లబ్ టౌన్ ప్రసిడెంట్ మురహరి జగదీశ్వరరావు అందించారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ కో ఆర్డినేటర్ నిచ్చెనమెట్ల సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ చిట్టెం రమేష్, కార్యదర్శి కామేశ్వరరావు పాల్గొన్నారు.

## అయోడిన్ లోపంతో ఆరోగ్య సమస్యలు



మాట్లాడుతున్న డాక్టర్ హిమబిందు

ప్రొద్దుటూరు క్రైం : అయోడిన్ లోపం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయని డాక్టర్ నల్లబల్లె హిమబిందు తెలిపారు. గ్లోబల్ అయోడైడ్ ప్రివెన్సస్ వారోత్సవాల ముగింపు సందర్భంగా వైఎంఆర్ కాలనీలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ గర్భస్థ శిశువు, గర్భిణులకు, పాలిచ్చే తల్లులు, చిన్న పిల్లల ఎదుగుదలకు అయోడిన్ చాలా అవసరమన్నారు. అయోడిన్ లోపం వల్ల గర్భస్రావం, మృత శిశువుల జననం , అనువంశిక జనన లోపాలు తదితర సమస్యలు వస్తాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ అయోడైజ్డ్ ఉప్పును వాడాలని సూచించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ ఆర్గనైజర్ ఎంవీ సుబ్బారెడ్డి, యూపీహెచ్‌సీ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## గీతాశ్రమం ఈఓపై చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు : స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమం ఈఓ, దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శంకర్ బాలాజీపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌ఓ రాయలసీమ కన్వీనర్ కత్తి ఓబులేసు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ మనోహర్‌రెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఓబులేసు మాట్లాడుతూ గీతాశ్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా నామా ఎరుకలయ్య స్థాపించారన్నారు. ఆశ్రమంలోని పెద్ద ట్యాంక్‌ను పగులగొట్టి విద్యార్థులకు, ఆవులకు, ప్రజలకు తాగునీరు లేకుండా ఈఓ చేశారన్నారు. పేద విద్యార్థులు చదువు అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన మళయాలస్వామి బీఈడీ, టీపీటీ కాలేజీలకు యూజీసీ గుర్తింపు రద్దు అయినా ఈఓ రెన్యువల్ చేసేందుకు చర్యలు తీసుకోలేదన్నారు. దీంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులు పైచదువులకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. గతేడాది రూ.18 లక్షలతో నిర్మించిన మరుగుదొడ్లు దుర్వాసన వస్తూ అధ్వానంగా ఉన్నాయన్నారు. ఆశ్రమంలో ఉన్న విద్యాసంస్థల వారు వాటర్ క్యాన్ల కోసం రోజూ డబ్బులు పెట్టి కొనుగోలు చేస్తున్నారన్నారు. ఈఓ విధులు చేపట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు వచ్చిన కోట్లా రూపాయల ఆదాయం ఎంత వరకు ఖర్చు చేశారో ప్రజలకు తెలపాలన్నారు.

## బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి పెద్దపీట

**గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధ**



రెడ్డికొట్టాలలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

కాశినాయన : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని రెడ్డికొట్టాల గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టారు. మండలస్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికి తిరిగారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రతి కుటుంబం ఏదో ఒక పథకం ద్వారా లబ్ధి పొందిందని మహిళలు తెలిపారు. వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల పేరుతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు దోచుకున్నారన్నారు. మనందరి ప్రభుత్వం వచ్చిన తర్వాత పథకాలు పారదర్శకంగా అమలవుతున్నాయని తెలిపారు. పార్టీలు, కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. అందరి మేలు కోరుతున్న జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు ఆదిత్యరెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు రాజశేఖర్‌రెడ్డి, చెంద్రాయుడు, మాజీ ఎంపీటీసీ విజయమ్మ, ఈఓపీఆర్‌డీ ముజఫర్ రహీమ్, మండలస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

## నావికాదళ అధికారులకు మరణశిక్ష అమానుషం

పోరుమామిళ్ల : ఖతర్ కోర్టు భారతీయ మాజీ నావికాదళ అధికారులకు మరణశిక్ష విధించడం అమానుషమని, గర్హనీయమని సమరసత ప్రముఖ్ బాలరంగయ్య అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 8 మంది భారతీయ నావికాదళ అధికారులకు మరణ శిక్ష విధించడం మతపరమైన కక్షగా కనబడుతోందన్నారు. అల్ దహ్రా కంపెనీ సీఈఓ ముస్లిం అయినందున అతన్ని విడుదల చేసి, ఆ కంపెనీ తరఫున పని చేసిన భారతీయులకు మాత్రమే శిక్ష విధించడం న్యాయం కాదన్నారు. న్యాయస్థానం తీర్పును పునః సమీక్షించాలని బాలరంగయ్య కోరారు. కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో అంతర్జాతీయ న్యాయ నియమాలను ఉపయోగించుకొని వారి విడుదలకు కృషి చేయాలన్నారు.